క్లుప్తంగా

బీమా చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న చైర్మన్, మేనేజర్

దుమ్ముగూడెం : దుమ్ముగూడెం సొసైటీ సంఘం సభ్యురాలైన ఝాన్సీరాణి 5 నెలల క్రితం ప్రమాదవశాత్తు మరణించడంతో బాధిత కుటుంబసభ్యులకు సొసైటీ చైర్మన్ కిలిమి ఎల్లారెడ్డి చేతుల మీదుగా రూ.1 లక్ష చెక్కును శుక్రవారం అందజేశారు. డీసీసీబీ లక్ష్మీనగరం బ్రాంచి మేనేజర్ నర్సింహారావు, సంఘం సెక్రటరీ ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



బీమా చెక్కులు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మెన్ చందర్‌రావు

చండ్రుగొండ: మండలంలోని గానుగపాడు గ్రామంలోని సహకార పరపతి సంఘంలో సభ్యులు ఉన్న వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలకు బీమా చెక్కులను శుక్రవారం చైర్మన్ చెవుల చందర్‌రావు పంపిణి చేశారు. వివిధ గ్రామాలకు చెందిన కుక్కల సుజాత, ఎస్కే ఫాతిమున్, అజ్మీర రామి, కందికొండ అప్పమ్మ, మూడు నంద, కుక్కల మల్లేశ్వరి, కునుసోతు లలితలకు ఒక్కొక్కరికి రూ. 50 వేలు చెక్కులను అందించారు. సొసైటీ సీఈఓ లంకా నర్సింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులు..



విద్యార్థులకు చెక్కుల పంపిణీ..

మణుగూరు రూరల్ : మండలానికి చెందిన ముగ్గురు పేద ఇంటర్ విద్యార్థులకు మణుగూరు మండల కమ్మ మహాజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.30వేల స్కాలర్ షిప్ చెక్కులను సంఘం సభ్యులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ... సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేద విద్యార్థులకు ప్రతీ ఏటా ఆర్థిక చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. కమ్మ మహాజన సేవా సంఘం సభ్యులు పుచ్చకాయల శంకర్, వీరపనేని చెన్నకేశవులు, మానుకొండ ఉమాకర్, పోశం భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజాసేవకే రాజకీయాల్లోకి



మాట్లాడుతున్న మర్రి మల్లారెడ్డి

అశ్వాపురం: ఉన్నత చదువులు చదివి ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని మొండికుంట మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో పంచాయతీ నిధులు చేసిన పనులకే చెల్లించామని ప్రతీదానికి ఎంబీ రికార్డు, ఆడిట్ రిపోర్టు, పంచాయతీ తీర్మానం లేకుండా ఏ కార్యక్రమం చేయలేదన్నారు. కొంత మంది తెలిసి తెలియని అవగాహన లోపంతో విమర్శిస్తున్నారని అభివృద్ధి చూసి ఓర్వలేక తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భద్రాచలం(భద్రాచలంఅర్బన్): భద్రాచలం పట్టణంలోని కొర్రాజులగుట్ట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భద్రాచలం పట్టణ వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రాజారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని పేర్కొన్నారు.

దమ్మపేట: మండలంలోని మందలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని వియోగదారులకు నేడు(శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో చేయనున్న మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అశ్వారావుపేట డిస్కం ఏడీఈ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

చింతకుంట..

ఆదరణకు కరువవుతున్న ఆదివాసీలు

- అంధకారంలో జీవిస్తూ అనారోగ్యాల పాలు
- తాగునీటి సౌకర్యం అంతంతమాత్రమే
- పూరి గుడిసెలోనే అంగన్‌వాడీ కేంద్రం



వలస ఆదివాసీలు నివసిస్తున్న చింతకుంట గ్రామం

అశ్వాపురం: పొట్టచేతపట్టుకుని ఇతర రాష్ట్రాల నుంచి 20 ఏళ్ల క్రితం వలస వచ్చిన ఆదివాసీలు ఆదరణకు నోచుకోక కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. కనీస సౌకర్యాలైన తాగునీరు, రోడ్లు, విద్యుత్, విద్య, వైద్య సౌకర్యాలు అందక వలస గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కనీస విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చీకట్లోనే జీవనం..

మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి చింతకుంట ఏరియాలో నివసిస్తున్న వలస ఆదివాసీ గిరిజనులు విద్యుత్ సౌకర్యం లేక చీకట్లో గడుపుతూ అనారోగ్యాల పాలవుతున్నారు. ఛత్తీస్‌ఘఢ్ నుంచి 2005లో వలస వచ్చిన ఆదివాసీలు మల్లెలమడుగు పంచాయతీలోని చింతకుంట అటవీ ప్రాంతంలో గుడిసెలు వేసుకొని స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారు. మల్లెలమడుగు పంచాయతీలో ఆధార్ కార్డులు, ఆహారభద్రతకార్డులు, ఆసరా పింఛన్లు పొందుతూ ఓటు హక్కులు పొంది గ్రామంలో నివాసానికి హక్కులు సాధించుకున్నారు. వీరికి మినీ అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉంది. కానీ విద్యుత్ సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. గిరిజనులకు విద్యుత్ సౌకర్యం పై ఐటీడీఏ అధికారులు దృష్టి సారించడం లేదు. విద్యుత్ సౌకర్యం లేక చీకట్లో గడుపుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వలస ఆదివాసీలు వాపోతున్నారు.

అనారోగ్యాల పాలవుతూ..

గిరిజన ఆదివాసీలు గుడిసెల చుట్టూ దట్టమైన అటవీప్రాంతం ఉండి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పాములు, జంతువులతో ప్రాణభయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయంభయంగా నివసిస్తున్నారు. విద్యుత్ సౌకర్యం లేక దోమలు విజృంభిస్తూ చిన్నారులు, వృద్ధులు అనారోగ్యాల పాలవుతున్నారు. రోజురోజుకు ఆరోగ్యాలు క్షీణించి రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పించి ఇబ్బందులు తొలగించాలని వలస ఆదివాసీలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం భవనం లేదు..

తాగునీటికి చేతిపంపులే దిక్కు..

ఆదివాసీ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించి ఆరోగ్య సలహాలు సూచనలు చేసేందుకు అంగన్‌వాడీ కేంద్రం భవనం కూడా లేదు. ఎన్నో ఏళ్లుగా గుడిసెలోనే మినీ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. సరైన వసతులు లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వలస ఆదివాసీలకు తాగునీటి సౌకర్యం అంతంతమాత్రమే. రెండు చేతిపంపులు ఉన్నా సక్రమంగా పని చేయడం లేదు. మరమ్మతులు పట్టించుకోవడం లేదు. పైపులైన్లు వేసి ఇంటింటికి తాగునీరు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం..



గ్రామ పంచాయతీలో గత 20 ఏళ్లుగా నివసిస్తున్నాం. 20 ఏండ్లుగా విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పించాలి. అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేదు. ఇంటింటికి నల్లా ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలి.

– కుర్సం రమేష్, చింతకుంట, మల్లెలమడుగు

రోగాల బారిన పడుతున్నాం



విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం లేక పాములు, జంతువులతో ప్రాణభయంతో నివసిస్తున్నాం. దోమలు విజృంభిస్తూ చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించాలి. అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మించాలి. రోడ్లు నిర్మించాలి.

– మడకం దేవ, చింతకుంట

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరు టౌన్/మణుగూరు రూరల్ : వలస ఆదివాసీలు అసాంఘిక శక్తులకు, అపరిచితులకు అవకాశమివ్వరాదని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పగిడేరు పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామమైన విప్పలగుంపులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడి వారి వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్తులకు ఎలాంటి సాయం కావాలన్నా సంప్రదించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ సహకరించాలన్నారు. అనంతరం మండలంలోని ఆదివాసీ గ్రామాలకు చెందిన యువకులకు సీఐ సతీష్‌కుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వాలీబాల్ కిట్ అందజేశారు. యువత చెడు వ్యసనాలకు, దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై రాజమౌళి

అశ్వారావుపేట (ములకలపల్లి) : ఇసుక అక్రమంగా రవాణాకు పాల్పడితే సహించేదిలేదని, అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్సై రాజమౌళి స్పష్టం చేశారు. మండలపరిధిలోని గుర్రాలకుంట క్వారీలో ట్రాక్టర్లు సీజ్ చేసిన నేపథ్యంతో శుక్రవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్ యజమానులకు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మండలపరిధిలోని పలుగ్రామాల్లో ఇసుక అక్రమంగా రవాణాకు పాల్పడుతున్న పోలీస్‌శాఖకు సమాచారం ఉందన్నారు. ఈ విషయంలో ఎటువంటి వారినైనా ఉపేక్షించేదిలేదని అన్నారు.

గ్రామాల్లో బీజేపీ డిజిటల్ రథం

అశ్వాపురం: మండల పరిధిలోని కొమ్ముగూడెం, ఆనందాపురం, భీమవరం, రామవరం, తుమ్మలచెరువు, సీతారాంపురం, గొందిగూడెం, మామిళ్లవాయి, మొండికుంట, అశ్వాపురం గ్రామాల్లో బీజేపీ డిజిటల్ ప్రచార రథంతో శుక్రవారం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. నాయకులు పొడియం బాలరాజు, మండల ఇన్‌చార్జ్ కల్లూరి రామారావు, సుధాకర్ రెడ్డి, కల్లూరి నరసింహారావు, కోలా భాస్కర్, బండ్ల నాగేశ్వరరావు, సారయ్య పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌కు రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

భద్రాచలం (భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామ చేశారు. స్థానిక కేకే ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ పట్టణ కార్యదర్శి కొడిశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు, కార్యకర్తల సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ... మండలంలో నిర్వహించే సమావేశాలకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని, అందుకే మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నట్టు తెలిపారు. రాజీనామాలు చేసిన వారిలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు చింతాడి రామకృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు విజయ్‌తో పాటు పార్టీ అనుబంద సంఘాల నాయకులు, పట్టణంలోని 32 పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జ్‌లు రాజీనామా చేశారు.

రోడ్డు మధ్యలో గుంత.. రాకపోకలకు చింత



రహదారి మధ్యలో ఏర్పడిన భారీ గుంత

భద్రాచలం (భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో రోడ్డు మధ్యలో జాతీయ రహదారిపై గుంత పడింది. ఏడాది క్రితం చిన్నగా పడిన గుంత ఇప్పుడు పెద్దగా తయారైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరకు వచ్చే వరకు గుంత కనిపించకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై పలు చోట్ల గుంతలు పడిన అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

జాతర నృత్యాలపై విచారణ

అశ్వారావుపేట: జాతరలో అభ్యంతరకర నృత్యాలు శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా పోలీసు అధికారులు స్పందించారు. శుక్రవారం అశ్వారావుపేట మండలంలో విచారణ నిర్వహించారు. గురువారం రాత్రి జరిగిన నృత్యాల వీడియోలను సేకరించి విచారిస్తున్నారు.

వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చర్ల రూరల్: మండలంలోని సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుదునూరు గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల మండలంలో వైరల్ జ్వరాలు, ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతుండడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమైంది. వారికి మామూలు జ్వరాలుగానే గుర్తించినట్లు సత్యనారాయణపురం పీహెచ్‌సీ వైద్యాధికారిని దివ్యనయన తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మాస్‌లైన్‌లో చేరిక



పార్టీలో చేరిన మహిళలు

దమ్మపేట: మండల కేంద్రం పరిధిలోని మల్లారం కాలనీకు చెందిన పలువురు మహిళలు సీపీఐ ఎంఎల్, మాస్‌లైన్ పార్టీలో చేరారు. శుక్రవారం దమ్మపేట గ్రామంలోని మల్లారం కాలనీకు చెందిన భవిత మహిళ సంఘం సభ్యులు 30 మంది, మాస్‌లైన్ పార్టీ నాయకులు తోడెం దుర్గమ్మ, పండూరి వీరబాబుల ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో గంగాధర నాగమణి, సొంగా కుమారి, రజిత, శ్రీలత, మంగ తాయారు తదితరులు పాల్గొన్నారు.

నవమి ఏర్పాట్లు ఆరంభం

అశ్వారావుపేట: అశ్వారావుపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీరామ నవమి ఏర్పాట్లు శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ ముత్తా సుమాకర్ ఆధ్వర్యంలో ఆరంభించారు. తొలుత స్వామివారి కల్యాణానికి తలంబ్రాలను భక్తులు సిద్ధం చేసి కల్యాణ ఏర్పాట్లు మొదలుపెట్టారు.



తలంబ్రాలు సిద్ధం చేస్తున్న భక్తులు

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



బోరు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: వేసవి నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని వడ్డెర రంగాపురం, కోయ రంగాపురం, గుమ్మడవల్లి, నారాయణపురం, మల్లాయిగూడెం, వాగొడ్డుగూడెం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు నిర్మించిన తాగునీటి బోర్లను పరిశీలించి, గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పలు గ్రామాల్లో జరిగిన శుభ కార్యక్రమాల్లో పాల్గొని, నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నివాళి...

దమ్మపేట: మండలంలోని ముష్టిబండ గ్రామానికి చెందిన పరిటాల నిర్మల మృతి చెందాదగా ఎమ్మెల్యే జారే ఆమె మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ కృషి



పాటను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు రూరల్ : దేశంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి, సంక్షేమానికి అంబేడ్కర్ కృషి చేసి అనేక హక్కులు, చట్టాలను పొందుపరుస్తూ భారత రాజ్యాంగాన్ని రచించారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సారపాక ఐటీసీ ఉద్యోగి, గాయకుడు వల్లేపాక ముత్యాలరావు గాత్రంతో చిత్రీకరించిన అంబేడ్కర్ వీడియో సాంగ్‌ను, పాటల సీడీని ఎమ్మెల్యే శుక్రవారం స్థానిక ప్రజాభవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ పాటల సీడీ, వీడియో సాంగ్‌ను రూపొందించి వల్లేపాక ముత్యాలరావు బృందాన్ని ఆయన అభినందించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు పీరినాకి నవీన్, ప్రజాప్రతినిదులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ..

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో సరప సమ్మయ్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమ్మయ్య నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దిన్, ఎంపీటీసీలు ఏనిక రవి, కొమరం చిట్టెమ్మ, మాజీ సర్పంచ్‌లు పాయం భద్రమ్మ, కాకా రాములు, సుజాత, నాయకులు కేశవరెడ్డి, రమేష్, వీరభద్రారెడ్డి, సర్వేశ్వరరావు, పాల్గొన్నారు.

'గ్యారంటీల పేరుతో మోసం'



మాట్లాడుతున్న కవిత, పక్కన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తాతామధు

దుమ్ముగూడెం : ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. గంగోలు గ్రామంలోని వీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలం మండలాల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి సత్యావతి రాథోడ్, ఎమ్మెల్సీ తాతా మధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పంటలకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వరికి రూ. 500 బోనస్ ఇస్తామన్న హామీని తుంగలోకి తొక్కిందన్నారు. తాగునీరు, విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్నే కాంగ్రెస్ సర్కార్ కొనసాగిస్తోందన్నారు. సత్యావతి రాథోడ్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు దమ్ముగా నిలబడిన భద్రాచలం నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కార్యకర్తల కష్టంతో గెలిచి తన స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీలోకి డాక్టర్ తెల్లం వెంకట్రావు పార్టీ మారారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, డివిజన్ నాయకులు రావులపల్ల రాంప్రసాద్, మానె రామకృష్ణ, సాగి శ్రీనివాసరాజు, ఎంపీపీ రేసు లక్ష్మి, కణితి రాముడు, దామెర్ల శ్రీనివాసరావు, జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టండి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కరకగూడెం: పులుసు బొంత ప్రాజెక్టు సంబంధించి మరొకసారి సర్వే నిర్వహించి కాల్వల నిర్మాణాలతో రైతులేవరు నష్టపోకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం మణుగూరులోని ప్రజాభవన్ క్యాంపు కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాల రైతులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా పులుసు బొంత ప్రాజెక్టుతో వారికి కలిగే నష్టాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండలాధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, నాయకులు గొగ్గలి రవి, రామకృష్ణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గుండాల: మండలంలోని పడుగోనిగూడెంలో ఉమామహేశ్వర ఆలయ జీవధ్వజ శిఖర పరివార దేవతా ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కేతముక్కల పవన్ కుమార్ శర్మ, తీర్థం రామక్రిష్ణ శర్మ, సనత్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో త్రయాహ్నిక దీక్షతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మూడు రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సముదాయ ధర్మకర్త గడేపల్లి లోకేశ్వరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారి నాగయ్య, బూబూరాబు, పోతయ్య , నరేందర్, గ్రామపెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు

కుంజా బొజ్జి జీవితం నేటితరానికి ఆదర్శం



భద్రాచలంలో కుంజా బొజ్జి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



దుమ్ముగూడెంలో..

భద్రాచలం(భద్రాచలంఅర్బన్): మార్క్సిస్టు విలువలకు కట్టుబడి నమ్మిన సిద్ధాంతం కోసం, ఎర్రజెండా అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన కుంజా బొజ్జి జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే కాలనీలో శుక్రవారం కుంజా బొజ్జి వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కుంజా బొజ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూడు పర్యాయాలు శాసనసభ్యుడిగా భద్రాచలం నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించి ఎమ్మెల్యే పదవికే వన్నెతెచ్చిన నేత కుంజా బొజ్జి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటరెడ్డి, ఎన్.లీలావతి, వై వెంకటరామారావు, ఐలు జిల్లా అధ్యక్షులు ఎం.వి ప్రసాద్ రావు, భాస్కరరావు పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి, కుంజా శ్రీనివాస్, భూపేంద్ర, కోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : మండలంలోని ములకపాడులో యలమంచి సీతారామయ్య భవనంలో కుంజా బొజ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడగా నాయకులు యలమంచి శ్రీనుబాబు, తెల్లం ధర్మయ్య, బైరెడ్డి సతీష్, కొర్రె రాము, మహేష్, శంకర్, మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.